WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ | సోమవారం, మే 25, 2026 | సంపుటి:13 | సంచిక :4 | పేజీలు: 8 | వెల : రూ.5

## కాలుష్య కాటుకు కౌంట్‌డౌన్ మొదలైందా?

### గ్రామాల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో యాజమాన్యంలో గుబులు



- పత్రాల్లో శుద్ధి.. క్షేత్రస్థాయిలో కాలుష్యమంటూ ఆరోపణలు
- ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ఆందోళన
- ఆర్టీఐ పత్రాలతో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు
- కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలపై అనుమానాలు
- భూగర్భ జలాల కాలుష్యంపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం
- పరిస్థితి అదుపు తప్పితే భారీ ఉద్యమాలకు అవకాశం
- వ్యవహారం ఎన్‌జీటీకి వెళ్తే పరిశ్రమకు కఠిన చర్యల ముప్పు
- "ప్రజల ప్రాణాలా..? పరిశ్రమ లాభాలా..?" అంటూ స్థానికుల ప్రశ్నలు
- ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే యాజమాన్యానికి, అధికారులకు ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు

2లో





2లో

## 'యువన్ వైన్స్' బహిరంగ దందా..?

### వైరల్ వీడియోలతో బట్టబయలైన మద్యం మాఫియా వ్యవహారం

- కదిలించిన కస్టమర్ కెమెరాకు చిక్కిన మద్యం సిండికేట్ బాగోతం
- మద్యం మాత్రమే కాకుండా వాటర్ బాటిల్, గ్లాసులపై సైతం దోపిడీ
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ? నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం
- నిర్ణయిత ధరలకు అమ్మమంటే "ఇష్టమైతే తీసుకో.. లేదంటే వెళ్లిపో" అంటూ నిర్వాహకుల బరితెగింపు సమాధానాలు
- మద్యం దుకాణాల అక్రమ వసూళ్లపై ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటుందా..?



3లో

## "వెదురు కర్రలు" -- "వెదురు బొంగులు"

### పదాల మార్పులోనే ఉందా అసలు మలుపు?

స్థానికుల ఆరోపణల్లో "వెదురు కర్రలు" అనే పదం వినిపిస్తుండగా... అధికారిక వివరణలో మాత్రం "వెదురు బొంగులు" అనే పదం ఉపయోగించడం కొత్త అనుమానాలకు దారి తీసింది. అడవిలో నరికివేత జరిగిన వెదురు ఏ రూపంలో తరలించబడింది..? డిపోకు పంపిన సరుకు వివరాలు ఏమిటి..? ఎన్ని ట్రిప్పులు వెళ్లాయి..? వాటికి సంబంధించిన రికార్డులు ఉన్నాయా..? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

వెదురు కర్రలు, వెదురు బొంగులు పేర్లతో అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నమా..? లేక నిజంగానే అధికారిక తరలింపే జరిగిందా..? అన్నది ఫారెస్ట్ ఉన్నతాధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

- జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు నిధులు కేటాయించిన రేవంత్ ప్రభుత్వం
- రైతులను కాపాడాలని సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న తుమ్మల
- పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



4లో

## 2 వారాల్లో నాలుగోసారి..

# మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

- దేశంలో మరోసారి భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతోనే ధరలు పెరుగుతున్నాయని వెల్లడి
- చమురు కంపెనీల నష్టాలను పూడ్చుకునేందుకే ఈ పెంపు అని వివరణ



దేశవ్యాప్తంగా ఇంధన ధరలు మరోసారి భారీగా పెరిగాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను సవరించాయి. తాజా పెంపుతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 పెరిగింది. గత రెండు వారాల్లో ఇంధన ధరలు పెరగడం ఇది నాలుగోసారి. ఈ పెరుగుదలతో దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12కు, డీజిల్ ధర రూ. 95.20కు చేరింది. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా రవాణాకు అంతరాయం కలగడంతో చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నష్టాలను పూడ్చుకునేందుకే చమురు సంస్థలు ధరలను పెంచక తప్పడం లేదని తెలుస్తోంది. ఈ పెంపునకు ముందు, సుమారు 76 రోజుల పాటు ధరలను స్థిరంగా ఉంచడం వల్ల చమురు కంపెనీలు రోజుకు దాదాపు రూ. 1,000 కోట్ల నష్టాన్ని చవిచూశాయని అంచనా. ఈ పరిణామాలపై ఓఎన్‌జీసీ డైరెక్టర్ (ఎక్స్‌ప్లోరేషన్) సుష్మా రావత్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా ముడి చమురు ధరలు తీవ్రంగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని తెలిపారు. "ప్రభుత్వం 76 రోజుల పాటు ధరలు పెంచకుండా ప్రజలకు ఉపశమనం ఇచ్చింది. కానీ కంపెనీలకు ఇంత భారీ నష్టం వస్తుంటే ఎంతకాలం భరించగలరు?" అని ఆమె ప్రశ్నించారు. తాజా పెంపుతో ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలపై మరింత భారం పడనుంది. ముఖ్యంగా డీజిల్ ధరల పెరుగుదల రవాణా ఖర్చులను పెంచుతుంది. ఇది నిత్యావసర వస్తువుల ధరలపై నేరుగా ప్రభావం చూపుతుంది.

# ‘యువన్ వైన్స్’ బహిరంగ దందా?

ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం (నవతరం ప్రతినిధి, మే 24): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలోని “యువన్ వైన్స్” (దుకాణం సంఖ్య-024)లో జరుగుతున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వసూళ్ల వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలతో సంచలనంగా మారింది. ఓ మద్యం వినియోగదారుడు స్వయంగా తీసిన వీడియోలు, చిత్రాలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. లైసెన్స్ ఉందనే అహంకారంతో సామాన్య వినియోగదారులను నిలువునా దోచుకుంటున్న మద్యం దుకాణాల సిండికేట్ వ్యవహారం ఈ వీడియోల ద్వారా వెలుగులోకి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ, “ఎవరికైనా చెప్పుకోండి” అన్న ధోరణిలో వ్యవహరిస్తున్న దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.









### వైరల్ వీడియోల్లో ఏముంది..? వినియోగదారులతో వాగ్వాదాలు

వైరల్ అవుతున్న వీడియోల ప్రకారం, సదరు మద్యం దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బదులుగా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఒక వినియోగదారుడు మద్యం సీసా ధరపై ప్రశ్నించగా, అక్కడి సిబ్బంది అత్యంత నిర్లక్ష్యంగా, బరితెగింపుగా స్పందించిన దృశ్యాలు వీడియోలో రికార్డు అయ్యాయి.

“ఇష్టమైతే తీసుకోండి... లేదంటే వెళ్లిపోండి... మేం ఇంతే అమ్ముతాం...” అంటూ వినియోగదారుడితో వాగ్వాదానికి దిగినట్లు వీడియోలో వినిపిస్తున్న మాటలు ఇప్పుడు ప్రజల్లో చర్చకు దారితీశాయి.

### మద్యం సీసాలకే కాదు.. తాగునీరు, గాజు గ్లాసులపైనా అదనపు వసూళ్లు..?

కేవలం మద్యం సీసాలపైనే కాదు... తాగునీటి సీసాలు, గాజు గ్లాసులు వంటి వస్తువులపైనా ముద్రిత ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

“చిల్లర లేదు”, “చల్లదనం ఖర్చు” వంటి పేర్లతో అదనపు డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

బయట ప్రభుత్వ ధరల బోర్డులు... లోపల మాత్రం దోపిడీ ఆరోపణలు

దుకాణం వెలుపల “ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయం” మరియు “ముద్రిత ధర కంటే ఎక్కువ వసూలు చేయరాదు” అనే బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, లోపల మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

“ప్రజలను నమ్మించడానికి బయట బోర్డులు... లోపల మాత్రం అదనపు వసూళ్లు” అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సిండికేట్ వ్యవస్థ నడుస్తోందా..? ప్రజల్లో అనుమానాలు

అశ్వారావుపేటతో పాటు పరిసర ప్రాంతాల్లోని కొన్ని మద్యం దుకాణాలు ఒకే తాటిపై నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే విధమైన ధరలు, ఒకే తరహా సమాధానాలు, వినియోగదారులను బెదిరించే ధోరణి కారణంగా ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక బలమైన సిండికేట్ వ్యవస్థ ఉందా..? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

### ప్రశ్నించిన వినియోగదారులకు బెదిరింపులా..?

ఈ అదనపు వసూళ్లపై ఎవరైనా ప్రశ్నిస్తే, కౌంటర్ల వద్ద ఉన్న సిబ్బంది దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ వినియోగదారులను బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వైరల్ వీడియోల తర్వాత కూడా చాలామంది వినియోగదారులు బహిరంగంగా మాట్లాడేందుకు భయపడుతున్న పరిస్థితి ఉందని సమాచారం.

### ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు..? ప్రజల ప్రశ్నలు,

వీడియో ఆధారాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖ నుంచి అధికారిక స్పందన రాకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.

“ముద్రిత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరికలు జారీ చేసే అధికారులు... ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రజల ప్రధాన డిమాండ్లు ఇవే: సమగ్ర విచారణ

వైరల్ వీడియోలు, చిత్రాల ఆధారంగా ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### అనుమతి పత్రం రద్దు

నిబంధనల ఉల్లంఘనలు నిజమని తేలితే సంబంధిత మద్యం దుకాణం అనుమతి పత్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### చట్టపరమైన చర్యలు

వినియోగదారులను బెదిరించడం, అధిక ధరలు వసూలు చేయడం వంటి అంశాలపై కేసులు నమోదు చేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

### ప్రత్యేక తనిఖీలు

జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్ల వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వైరల్ వీడియోలతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం... ఇప్పుడు అధికారుల చర్యలపై ఆసక్తి ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోలు జిల్లాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజల నుంచి వస్తున్న ఆరోపణల్లో ఎంతవరకు నిజం ఉందో తేల్చాల్సిన బాధ్యత ఇప్పుడు ఎక్సైజ్ శాఖ, జిల్లా ఉన్నతాధికారులపై పడింది. వీడియోల్లో వినిపిస్తున్న మాటలు, కనిపిస్తున్న దృశ్యాలు నిజమైతే... ఇది కేవలం ఒక్క దుకాణం వ్యవహారమేనా..? లేక జిల్లావ్యాప్తంగా నడుస్తున్న పెద్ద అక్రమ వ్యవస్థలో భాగమా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అశ్వారావుపేటలో కాలుష్య కోరలు

- లక్ష్మీ తులసి పేపర్ బోర్డు యాజమాన్యానికి తప్పని ముప్పు?
- కాగితాల్లో శుద్ధి క్షేత్రస్థాయిలో కెమికల్ మురుగు నీరు
- ఆర్టీఐ అస్త్రాలతో గ్రామస్థుల సమర శంఖం
- రాత్రి వేళల్లో ‘చీకటి’ దందా,ఊపిరాడక జనం అల్లాడాల్సిందేనా?
- విషతుల్యమైన భూగర్భ జలాలు,రైతాంగం ఆగ్రహిస్తే పతనం తప్పదు
- అధికారులు వస్తేనే ఆన్,మిగిలిన రోజుల్లో అంతా మాయాజాలమే
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్‌జీటీ చాటున మూసివేత ముప్పు



**నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా**

అశ్వారావుపేట మండలంలో తిష్టవేసిన “శ్రీ లక్ష్మీ తులసి ఆగ్రో పేపర్ బోర్డు” పరిశ్రమ చుట్టూ ఇప్పుడు కాలుష్య ఉచ్చు బిగుస్తోంది. “పరిశ్రమ మాకొద్దు... మా ప్రాణాలు మాకు కావాలి” అంటూ స్థానిక గ్రామస్థులు గళమెత్తడంతో యాజమాన్యంలో గుబులు మొదలైనట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు గుట్టుచప్పుడు కాకుండా సాగిన వ్యవహారం, ఇప్పుడు సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడిన పత్రాలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నివేదికలతో బహిర్గతమవుతోంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ మురుగు జలాలను బయటకు వదులుతున్నారనే ఆరోపణలు ఇప్పుడు కంపెనీ ఉనికికే ముప్పుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చాలాకాలంగా కాలుష్యంపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, ఇప్పుడవి మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, పంట భూములు దెబ్బతింటున్నాయని, రాత్రి వేళల్లో పరిశ్రమ నుంచి వచ్చే పొగ, బూడిద, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

### రాత్రి వేళల్లో ‘చీకటి’ దందా.. గ్రామస్థుల ఊపిరి తీస్తున్న పొగ, బూడిద

పరిశ్రమలో ఉన్న భారీ బాయిలర్ల నిర్వహణపై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పగటిపూట అంతా సవ్యంగా ఉన్నట్లు చూపిస్తూ, రాత్రి వేళల్లో మాత్రం భారీగా పొగ, బూడిదను విడుదల చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బొగ్గు, వరి తొక్కలను, ఊక పొట్టును ఇంధనంగా ఉపయోగిస్తున్న ఈ బాయిలర్ల వల్ల చుట్టుపక్కల గ్రామాలపై బూడిద కురుస్తోందని స్థానికులు చెబుతున్నారు. “పగలు అధికారులు వస్తే అంతా సవ్యంగా ఉందంటారు. రాత్రిళ్లు మాత్రం మేము ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది” అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతుండటంతో త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగే అవకాశం ఉందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

### కాగితాల్లో శుద్ధి... క్షేత్రస్థాయిలో కెమికల్ మురుగు నీరు

పరిశ్రమకు ఇచ్చిన అనుమతుల ప్రకారం మురుగు నీటిని పూర్తిగా



శుద్ధి చేసిన తరువాత మాత్రమే పచ్చదనం అభివృద్ధి, దుమ్ము నివారణ, బూడిద చల్లబరచడం వంటి పనులకు వినియోగించాల్సి ఉంది. బయటకు విడుదల చేయరాదని నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయి.

### అయితే గ్రామస్థుల ఆరోపణల ప్రకారం

“శుద్ధి కేంద్రం పేరుకే ఉంది. సాధారణ రోజుల్లో కెమికల్ కలిసిన మురుగు నీటిని కాలువల ద్వారా బయటకు వదులుతున్నారు” అని చెబుతున్నారు. వర్షాకాలంలో ఈ మురుగు నీరు మరింత విచ్చలవిడిగా బయటకు వస్తోందని ఆరోపిస్తున్నారు. అధికారులు వస్తేనే ఆన్... మిగిలిన రోజుల్లో అంతా మాయాజాలమే

మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు మాత్రమే శుద్ధి కేంద్రాన్ని నడుపుతూ, మిగిలిన రోజుల్లో దాన్ని నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. “అధికారులు వచ్చే రోజే యంత్రాలు పనిచేస్తాయి. మిగతా రోజుల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది” అని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాచార హక్కు ద్వారా బయటపడిన పత్రాల్లో నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం వేరుగా ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

### విషతుల్యమైన భూగర్భ జలాలు-రైతాంగం ఆగ్రహిస్తే పతనం తప్పదు

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన అశ్వారావుపేటలో భూగర్భ జలాల కాలుష్యం ఇప్పుడు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బోర్ల నీటి రంగు మారుతోందని, దుర్వాసన వస్తోందని, పంటల దిగుబడి తగ్గుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

“పొలాల్లో నీరు వాడితే పంటలు పాడైపోతున్నాయి. భూమి సారవంతత తగ్గుతోంది” అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం మరింత తీవ్రమైతే రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతోందని సమాచారం.

### ప్రమాదకర వ్యర్థాల గుట్టలు.. ఎటు పోతున్నాయి?

పరిశ్రమ నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాల నిర్వహణపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మురుగు శుద్ధి కేంద్రం నుంచి వచ్చే మట్టి, వ్యర్థ నూనెలు, రసాయన డబ్బాలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారిక పత్రాల్లో అన్ని నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు వేరుగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఆర్టీఐ అస్త్రాలతో గ్రామస్థుల సమర శంఖం

స్థానికులు సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ అధికారులను నిలదీస్తున్నారు. పరిశ్రమ నుంచి మురుగు నీరు బయటకు వెళ్తుందా? శుద్ధి కేంద్రం సక్రమంగా పనిచేస్తుందా? భూగర్భ జలాల పరీక్షలు జరిగాయా? వంటి ప్రశ్నలను సంధిస్తూ సమాధానాలు కోరుతున్నారు. ఈ సమాధానాల్లో కాలుష్య నియంత్రణ మండలి పరిశ్రమ వద్ద నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడైంది.

### అయితే గ్రామస్థులు మాత్రం:

“పత్రాల్లో ఒకలా చూపిస్తున్నారు... నేలమీద పరిస్థితి మరోలా ఉంది” అని ఆరోపిస్తున్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్‌జీటీ చాటున మూసివేత ముప్పు

స్థానికులు ఇప్పుడు ఈ వ్యవహారాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అదే జరిగితే పరిశ్రమకు భారీ జరిమానాలు, కఠిన చర్యలు, అవసరమైతే మూసివేత ముప్పు కూడా తప్పదని పర్యావరణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

గ్రామస్థులు: స్వతంత్ర విచారణ, నిరంతర కాలుష్య పర్యవేక్షణ, భూగర్భ జలాల ప్రత్యేక పరీక్షలు, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యానికి హెచ్చరిక– పత్రాల్లో ఒకటి.. క్షేత్రస్థాయిలో మరొకటి చెల్లదు

అధికారిక పత్రాల్లో కాలుష్య స్థాయిలు పరిమితుల్లోనే ఉన్నాయని చూపిస్తూ యాజమాన్యం తాత్కాలికంగా ఊపిరి పీల్చుకోవచ్చు. కానీ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరింత పెరిగితే పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉందని స్థానిక మేధావులు హెచ్చరిస్తున్నారు.

కాలుష్య నివారణ చర్యలు వెంటనే చేపట్టకపోతే, అటు ప్రజా వ్యతిరేకతకు, ఇటు ప్రభుత్వ కఠిన చర్యలకు యాజమాన్యం గురికాక తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఆరోపణలపై పరిశ్రమ యాజమాన్యం స్పందన కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# అడవిని మింగేస్తున్న 'వెదురు' దొంగలు..

**అశ్వారావుపేట ఫారెస్ట్‌లో కొత్త మలుపు**

**"వెదురు కర్రలా..? వెదురు బొంగులా..?"**

**బీట్ ఆఫీసర్ వివరణపై అనుమానాలు**

**దమ్మపేట డిపోకు అధికారిక తరలింపా..? లేక అక్రమ విక్రయాలా..?**

**పూర్తి నిజాలు తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే**










**నవతరం ప్రతినిధి: ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పేట మాలపల్లి సమీప అశ్వారావుపేట బీట్‌లో వెదురు సంపద అక్రమంగా తరలించబడిందన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. అడవిలో వెదురు గుబ్బలను నరికివేసిన ఆనవాళ్లు, కోసిన వెదురు భాగాల ఫోటోలు వెలుగులోకి రావడంతో గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం వెదురు కర్రలను ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.16 వరకు విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం లావాదేవీలు సుమారు రూ.10 లక్షల వరకు జరిగి ఉండొచ్చని కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడాల్సి ఉంది. అశ్వారావుపేట మండలం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉండటంతో పాపిడి గూడెం, స్వర్ణవారి గూడెం, కామయ్యపాలెం, అంకంపాలెం తదితర ప్రాంతాలకు వెదురు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొగాకు బేరాల నిర్మాణాల కోసం ఈ వెదురును వినియోగించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు అందించిన జీపీఎస్ మ్యాప్ కెమెరా ఫోటోల్లో వెదురు గుబ్బలను నరికివేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వెదురు పూర్తిగా తొలగించబడినట్లు కనిపిస్తుండగా, మరికొన్ని చోట్ల కోసిన ఆనవాళ్లు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. ఈ చిత్రాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

**" కర్రలా..? బొంగులా..?" కొత్త చర్చకు దారి**

ఈ వ్యవహారంపై స్పందించిన బీట్ ఆఫీసర్ వివరణ ఇప్పుడు కొత్త సందేహాలకు తావిస్తోంది. మొదట స్థానికంగా "వెదురు కర్రల" విక్రయాలపై ఆరోపణలు వినిపిస్తుండగా, అధికారికంగా మాత్రం "వెదురు బొంగులను" దమ్మపేట ఫారెస్ట్ డిపోకు తరలించినట్లు వివరణ ఇవ్వడం చర్చనీయాంశమైంది. "ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో వెదురు బొంగులను అధికారికంగా దమ్మపేట డిపోకు తరలించాం. సుమారు 50 నుంచి 54 ట్రిప్పుల వరకు సరుకు పంపించాం" అని బీట్ ఆఫీసర్ పేర్కొన్నట్లు సమాచారం. అయితే స్థానికులు ప్రశ్నిస్తున్నది మాత్రం మరో కోణంలో ఉంది. "అడవిలో నరికివేత జరిగినది వెదురు కర్రలా..? లేక డిపోకు తరలించినట్లు చెబుతున్న వెదురు బొంగులా..?" అనే అంశం ఇప్పుడు కొత్త మలుపుకు దారి తీసింది. ఈ వివరణల్లో ఏదో మతలపు ఉన్నట్లు కనిపిస్తోందని కొందరు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**"ఆధారాలు పంపండి.. చర్యలు తీసుకుంటాం"**

"మేము వెదురు కర్రలను అమ్ముకున్నట్లు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా..? ఫోటోలు, వీడియోలు ఉంటే పంపించండి" అని బీట్ ఆఫీసర్ కోరినట్లు తెలిసింది. ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా సరుకు తరలించారనే అంశంపై స్పష్టమైన ఆధారాలు అందితే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపినట్లు సమాచారం. అడవిలో కనిపిస్తున్న కొన్ని కత్తి కోతల ఆనవాళ్లు గ్రామస్థులు తమ అవసరాల కోసం నరికిన కర్రల వల్ల కూడా ఉండొచ్చని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. "మేకల కంచెల కోసం లేదా ఇంటి అవసరాల కోసం కొందరు చిన్న కర్రలు నరుకుతుంటారు" అని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

**సెలవు వ్యాఖ్యలపై కూడా చర్చ**

ఈరోజు ఆదివారం కావడంతో సెలవులో ఉన్నానని బీట్ ఆఫీసర్ చెప్పినట్లు సమాచారం. అయితే అవసరాన్ని బట్టి రేంజ్ అధికారుల అనుమతితో నోటి మాటగా సెలవులు తీసుకుంటామని ఆయన వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

**విచారణపై ప్రజల్లో అనుమానాలు:**

ఈ వ్యవహారంపై గతంలో ఎంక్వయిరీ జరిగినట్లు సమాచారం ఉన్నప్పటికీ పూర్తి వివరాలు బయటకు రాకపోవడం స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. అక్రమంగా వెదురు కర్రల విక్రయాలు జరిగాయా..? లేక అధికారికంగా వెదురు బొంగుల తరలింపే జరిగిందా..? అన్న అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు స్థానికుల ఆరోపణలు, అందుబాటులో ఉన్న కేవలం వెదురు కర్రల ఫోటోలు, వీడియోలు అలాగే సంబంధిత ఫారెస్ట్ సిబ్బంది ఇచ్చిన వివరణ ఆధారంగా రూపొందించబడినవి. పూర్తి స్థాయి అధికారిక దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.





## ఎమ్మెల్సీ సుంకరి రాజును కలిసిన చిర్ర రవీందర్ యాదవ్

కుత్బుల్లాపూర్ / శేరిలింగంపల్లి, నవతరం: శేరిలింగంపల్లి నియోజకవర్గం మెంబర్షిప్ ఇంచార్జిగా నియమితులైన శంబిపూర్ రాజు ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉద్యమకారుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గ బి ఆర్ ఎస్ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో నిర్వహించి, ప్రతి డివిజన్‌లో బి ఆర్ ఎస్ పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో కలిసి పనిచేయాలని చర్చించారు. ఉద్యమ కాలం నుండి పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు సముచిత గుర్తింపు రావాలని, పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బి ఆర్ ఎస్ పార్టీ చేసిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ సిద్ధాంతాలను మరింత బలంగా ప్రజలకు చేరవేయాలని అభిప్రాయపడ్డారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, కార్యకర్తల భాగస్వామ్యం వంటి పలు అంశాలపై సానుకూలంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ యాదవ్‌తో పాటు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు మిద్దెల మల్లారెడ్డి, గణేష్ రెడ్డి, బాబూమోహన్, మల్లేష్ మరియు యువ నాయకులు మాజిద్, సంతోష్, జువేడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను తేలుతో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ఆ పార్టీని చెప్పుతో కొట్టి చంపాలని ప్రజలకు పిలుపు**

**రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని విమర్శ**

**గోదావరి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎంకు బహిరంగ లేఖ**

బీఆర్ఎస్ పార్టీ విధానాలు వెనక నుంచి కాటు వేసే తేలు లాంటివని, అలాంటి పార్టీని చెప్పుతో కొట్టి చంపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, ఆ పార్టీ కేవలం కొన్ని మీడియా, సోషల్ మీడియాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. 'సారు.. కారు.. 16' అని ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని రాంచందర్‌రావు విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీ వద్దకు వంద సార్లు వెళ్లి నిధులు తెచ్చుకుంటూ, బయట మాత్రం కేంద్రం సహకరించడం లేదని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ కూడా ఇదే విధంగా వ్యవహరించి ప్రజలతో తిరస్కారానికి గురయ్యారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని రాంచందర్‌రావు మండిపడ్డారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో పూర్తిగా విఫలమైందని, కనీసం గోనె సంచులు, లారీలు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు పడితే, కాంగ్రెస్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో, గోదావరి బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి రాంచందర్‌రావు బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై ఎన్‌డీఎస్ఏ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## తిరుమలలో బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు... దర్శనానికి 30 గంటలు

**తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ**

**శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం**

**బాట గంగమ్మ ఆలయం వరకు చేరిన క్యూలైన్లు**

**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు**

**నిన్న శనివారం 97 వేల మందికి పైగా స్వామివారి దర్శనం**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండి పోయాయి. దీంతో క్యూలైన్లు బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడ గించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గం టల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధి కారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న వారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం, నిన్న మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శిం చుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.



## రేపటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర: రఘునందన్‌రావు

**రైతులతో రాజకీయాలు చేయడం**

**రేవంత్‌కు అలవాటుగా మారిందన్న రఘునందన్ రావు**

రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనబై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


# వాడివేడిగా పలాస రాజకీయాలు

పలాస, నవతరం: పలాస నియోజకవర్గ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. సిట్టింగ్ ఎమ్మెల్యే గౌతు శిరీషకు, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా)కు మధ్య మాటల యుద్ధం రాజుకుంది. దువ్వాడ శ్రీధర్ సంధించిన సూటి ప్రశ్నలకు టీడీపీ శిబిరం నుంచి సమాధానం రాకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర కలవరపాటు నెలకొందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం "పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గారు!.. నేను వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అంటూ శ్రీధర్ చేసిన సవాల్ ఇప్పుడు గ్రామగ్రామాన చర్చనీయాంశమైంది. టీ స్టాళ్ల నుంచి పంచాయతీ ఆఫీసుల వరకు ఇదే అంశంపై చర్చ జరుగుతోంది.

శ్రీధర్ లేవనెత్తిన ప్రధాన అంశాలు మూడే అయినా అవి నియోజకవర్గ ప్రజల మనసులో ఏళ్ల తరబడి ఉన్న ప్రశ్నలేనని స్థానికులు అంటున్నారు. మొదటిది పలాస జిల్లా అంశం. "పలాసను జిల్లా చేస్తామని ఎన్నికలకు ముందు, తర్వాత కూడా మీరు బహిరంగ సభల్లో పదేపదే ప్రకటించారు. పలాస జిల్లా ఏర్పాటు ఖాయమని ప్రజలకు హామీ ఇచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ప్రభుత్వం చివరి నిమిషంలో నిర్ణయం మార్చుకున్నప్పుడు పలాస జిల్లా కోసం మీరు అసెంబ్లీలో ఎందుకు గళం విప్పలేదు? శాసనసభ వేదికగా పలాస ప్రజల ఆకాంక్షను ఎందుకు వినిపించలేదు?" అని ఆయన నిలదీశారు. లక్షలాది మంది పలాస ప్రజల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు.

రెండోది మత్స్యకార బిడ్డ మువ్వల నగేష్ అనుమానాస్పద మృతి కేసు. "యువగళం పాదయాత్రలో నారా లోకేష్ గారు స్వయంగా నగేష్ కుటుంబాన్ని పరామర్శించి 'టీడీపీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో న్యాయం చేస్తాం' అంటూ బహిరంగంగా హామీ ఇచ్చారు. 100 రోజులు కాదు, ఏడాది పైగా గడిచిపోయింది. ఇప్పటికీ ఆ కుటుంబానికి న్యాయం జరగలేదు. కేసులో దోషులు బయటే తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ఏమైంది? నగేష్ తల్లిదండ్రుల కన్నీళ్లకు సమాధానం ఏది?" అని శ్రీధర్ ప్రశ్నించారు. ఈ అంశం మత్స్యకార సామాజిక వర్గంలో తీవ్ర ఆవేదనకు కారణమవుతోంది.

మూడోది మద్యం ధరల దోపిడీ. "పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ప్రతి బాటిల్‌పై ?20 అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో యథేచ్ఛగా నడుస్తున్న బెల్ట్ షాపుల్లో అయితే ?50 వరకు ఎంఆర్పీకి మించి దోచుకుంటున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని శ్రమజీవులు, మత్స్యకారులు, కూలీల కష్టార్జితాన్ని ఈ మద్యం సిండికేట్ జలగలా పీలుస్తోంది.




ఈ అక్రమ దందా మీ దృష్టికి రాలేదా? వస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ దోపిడీ వెనుక ఉన్న పెద్దలు ఎవరు? పేదలను పీడిస్తున్న ఈ దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు వేస్తారు?" అని శ్రీధర్ బాబా సూటిగా నిలదీశారు.

ఈ మూడు ప్రశ్నలకు ఎమ్మెల్యే వర్గం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం రాకపోవడం గమనార్హం. "దమ్ముంటే ప్రజల ముందుకు వచ్చి జవాబు చెప్పండి" అంటూ శ్రీధర్ విసిరిన సవాల్‌తో టీడీపీ శిబిరం ఇరుకున పడినట్లు కనిపిస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సోషల్ మీడియాలో సైతం శ్రీధర్ ప్రశ్నలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

ఇదిలా ఉండగా పలాస జిల్లా సాధన కోసం ఉద్యమ పోరాటాన్ని మరింత ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లి చైతన్య పరచడంలో దువ్వాడ శ్రీధర్ నిరంతరం కృషి చేస్తున్నారు. జిల్లా కావాలనే ఆకాంక్షను గ్రామగ్రామానికి తీసుకెళ్తూ, విద్యార్థి, యువజన సంఘాలను ఏకం చేస్తున్నారు. కేవలం రాజకీయ పోరాటమే కాకుండా, ఆయన చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు ఆయనను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేశాయి. పేద విద్యార్థులకు పుస్తకాలు, బీద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానాలు వంటి కార్యక్రమాలను ఆయన నిరంతరం నిర్వహిస్తున్నారు.

అంతేకాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, స్థానిక దేవాలయాల అభివృద్ధికి, ఉత్సవాలకు తనవంతు సహకారం అందిస్తూ అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతున్నారు. పలాస నియోజకవర్గంలో మత్స్యకారుల సమస్యలు, తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య, నిరుద్యోగం, రైతు సమస్యలు వంటి ప్రధాన అంశాలపై రాజీలేని పోరాటం చేస్తుండటం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. కోర్టుల్లో సైతం ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేసి ప్రజల పక్షాన నిలుస్తున్నారు.

టీడీపీ, వైసీపీలకు భిన్నంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న దువ్వాడ శ్రీధర్ భవిష్యత్తులో పలాసలో మూడో ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎదుగుతారనే చర్చ జోరుగా సాగుతోంది. "పార్టీలకు అతీతంగా సమస్యలపై నిలదీసే గొంతుకగా శ్రీధర్ బాబాను ప్రజలు చూస్తున్నారు. న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా ఆయనకున్న పరిచయాలు, చట్టాలపై అవగాహన, ప్రజా సమస్యలపై పట్టు ఆయనను ప్రజలకు దగ్గర చేస్తోంది" అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో శ్రీధర్ పర్యటనలకు, ఆయన లేవనెత్తే అంశాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ముఖ్యంగా మత్స్యకార యువత, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఆయన నాయకత్వంపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. "ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాడే నాయకుడు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ కోణంలో దువ్వాడ శ్రీధర్ వైపు ప్రజలు చూస్తున్నారు" అని కాశీబుగ్గకు చెందిన ఓ రైతు అభిప్రాయపడ్డారు.

మొత్తంగా పలాస రాజకీయం 'దువ్వాడ వ/ం ఎమ్మెల్యే గౌతు' అన్నట్లు మారడంతో వచ్చే రోజుల్లో ఇక్కడి రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. శ్రీధర్ సంధించిన ప్రశ్నలకు ఎమ్మెల్యే గౌతు శిరీష ఎలా స్పందిస్తారో, ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెబుతారో లేదో అని నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

## ఇండియాకు రావాల్సిన ఆయిల్ షిప్స్ చైనాకు వెళ్లాయా?



ఇండియాలో ఎల్‌పీజీ సరఫరా, పెట్రోల్ కొరతపై అనేక పుకార్లు ప్రచారమవుతున్నాయి. తాజాగా ఇండియాలో ఆయిల్ సరఫరా సంక్షోభం ఏర్పడనుందన్న మరో ప్రచారం జరుగుతోంది. భారతదేశానికి రావాల్సిన ఇరాన్ క్రూడ్ ఆయిల్ చైనాకి వెళ్ళిపోయిందన్నది ఆ ప్రచారం సారాంశం. భారత ప్రభుత్వం ఈ ప్రచారాన్ని ఖండించింది. ఇరాన్ క్రూడ్, ఇరాన్ ఆయిల్ దిగుమతి, ఇంధన సరఫరా వార్తలు, ఎల్పీజీ షిప్‌మెంట్, మంగళూరు ఎల్పీజీ అప్‌డేట్స్, భారత రిఫైనరీలు క్రూడ్ కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మినిస్ట్రీ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుండి వచ్చే క్రూడ్ షిప్ ఇండియాకు కాకుండా చైనాకి వెళ్లిపోయిందని జరుగుతున్న ప్రచారం తప్పని ఖండించింది. భారతదేశంలో ఇంధన సరఫరా పూర్తిగా సురక్షితంగా ఉందని స్పష్టం చేసింది. కేంద్రం పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఎక్స్ పోస్ట్ ద్వారా ప్రస్తుత పరిస్థితిపై వివరణ ఇచ్చింది. ఇరాన్ క్రూడ్, ఇరాన్ ఆయిల్ దిగుమతి, ఇంధన సరఫరా వార్తలు, ఎల్పీజీ షిప్‌మెంట్, మంగళూరు ఎల్పీజీ అప్‌డేట్స్, భారత రిఫైనరీలు క్రూడ్ ఆ ఎక్స్ పోస్ట్ ప్రకారం "చెల్లింపు సమస్యల కారణంగా భారతదేశంలోని వడినార్ నుండి చైనాకు ఇరాన్ ముడి చమురు సరుకును మళ్లించారనే వార్తా నివేదికలు, సోషల్ మీడియా పోస్టులు వాస్తవానికి తప్పు. భారతదేశం 40కి పైగా దేశాల నుండి ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. వాణిజ్యపరమైన అంశాలను బట్టి వివిధ వనరులు, భౌగోళిక ప్రాంతాల నుండి చమురును సేకరించడానికి కంపెనీలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది" అని తెలిపింది. ఇరాన్ క్రూడ్, ఇరాన్ ఆయిల్ దిగుమతి, ఇంధన సరఫరా వార్తలు, ఎల్పీజీ షిప్‌మెంట్, మంగళూరు ఎల్పీజీ అప్‌డేట్స్, భారత రిఫైనరీలు క్రూడ్ అంతే కాదు, "మధ్యప్రాచ్యంలో సరఫరా అంతరాయాల మధ్య, భారతీయ రిఫైనరీలు ఇరాన్‌తో సహా తమ ముడి చమురు అవసరాలను సురక్షితం చేసుకున్నాయి. ఇరాన్ ముడి చమురు దిగుమతులకు ఎటువంటి చెల్లింపు అడ్డంకి లేదు. నౌకల మళ్లింపుపై వస్తున్న వాదనలు చమురు వాణిజ్యం ఎలా పనిచేస్తుందో విస్మరిస్తున్నాయి. బిల్స్ ఆఫ్ లేడింగ్‌లో తరచుగా సూచనాత్మక దిగుమతి ఓడరేవుల గమ్యస్థానాలు ఉంటాయి. వాణిజ్య ఆప్టిమైజేషన్, కార్యాచరణ సౌలభ్యం ఆధారంగా సముద్రంలోని సరుకులు ప్రయాణం మధ్యలోనే గమ్యస్థానాలను మార్చుకోవచ్చు" అని తెలిపింది. ఇరాన్ క్రూడ్, ఇరాన్ ఆయిల్ దిగుమతి, ఇంధన సరఫరా వార్తలు, ఎల్పీజీ షిప్‌మెంట్, మంగళూరు ఎల్పీజీ అప్‌డేట్స్, భారత రిఫైనరీలు క్రూడ్ రాబోయే నెలలకు భారతదేశ ముడి చమురు అవసరాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించబడింది. ఎల్పీజీ విషయంలో కూడా, కొన్ని వాదనలు అవాస్తవమైనవని, ఎందుకంటే, సుమారు 44 టీఎంటీల ఇరాన్ ఎల్పీజీని తీసుకువస్తున్న 'సీ బర్డ్' అనే ఎల్పీజీ నౌక ఏప్రిల్ 2న భారతదేశంలోని మంగళూరుకు చేరుకుందని, ప్రస్తుతం సరుకును దించుతోందని స్పష్టం చేసింది. ఇరాన్ క్రూడ్, ఇరాన్ ఆయిల్ దిగుమతి, ఇంధన సరఫరా వార్తలు, ఎల్పీజీ షిప్‌మెంట్, మంగళూరు ఎల్పీజీ అప్‌డేట్స్, భారత రిఫైనరీలు క్రూడ్ భారతదేశం 2019 నుండి అధికారికంగా ఇరాన్ నుండి క్రూడ్ దిగుమతి చేయలేదు. అప్పుడు అమెరికా పరిమితుల వల్ల నిలిపివేశారు. తాజాగా పాటు సముద్రంలో ఉన్న షిప్‌లకు అమెరికా తాత్కాలిక రాయితీ ఇచ్చింది. దీని వల్ల ఇరాన్ నుండి సరుకులు మళ్లీ రావచ్చని అంచనా ఉంది. "భారతదేశ అవసరాలు వచ్చే నెలల్లో పూర్తిగా సురక్షితం. ఎలాంటి ఇంధన సమస్యలు ఉండవు" అని కేంద్రం పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ వివరించింది.

## వైన్ తయారీ వ్యాపారం ప్రారంభించాలా? యువతకు అదిరిపోయే అవకాశం ఇదే..



ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ ఫలాలతో వైన్ తయారీపై ప్రాక్టికల్ వేబినార్ నిర్వహిస్తోంది, తక్కువ పెట్టుబడితో వ్యాపారం, మార్కెటింగ్ మార్గదర్శకాలు అందిస్తుంది సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని అనుకునే వారికి సరైన మార్గదర్శకత్వం, ప్రణాళిక, ప్రాథమిక అవగాహన చాలా అవసరం. ఇలాంటి అవసరాలను తీర్చడానికి నిర్వహించే వేబినార్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. "పండ్లతో వైన్ తయారీ -- వ్యాపారం ప్రారంభించడానికి సులభ మార్గదర్శిని" అనే ఈ వేబినార్, వ్యాపార ప్రపంచంలోకి అడుగుపెట్టాలనుకునే వారికి ఒక అద్భుతమైన అవకాశం. ప్రస్తుతం యువతలో ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి వైపు మొగ్గు పెరుగుతోంది. కానీ వ్యాపారం అంటే పెద్ద పెట్టుబడి, రిస్క్, మార్కెట్ అనుభవం అవసరం అనే భావన చాలా మందిని వెనక్కి నెట్టేస్తోంది. ఈ వేబినార్ ద్వారా అలాంటి భయాలు తొలగిపోతాయి. తక్కువ పెట్టుబడితో కూడా ఎలా వ్యాపారం ప్రారంభించవచ్చో, ముఖ్యంగా ఫలాలతో వైన్ తయారీ వంటి ప్రత్యేకమైన రంగంలో ఎలా ముందుకు సాగాలో నిపుణులు వివరంగా చెప్పబోతున్నారు. పండ్లతోవైన్ తయారీ అనేది కేవలం ఒక ఉత్పత్తి తయారీ మాత్రమే కాదు, అది ఒక లాభదాయకమైన వ్యాపార అవకాశంగా కూడా మారుతుంది. మన ప్రాంతంలో సులభంగా లభించే ద్రాక్ష, జామ, బొప్పాయి, మామిడి వంటి పండ్లతో విలువైన ఉత్పత్తులను తయారు చేయవచ్చు. ఈ ప్రక్రియలో అవసరమైన ఫెర్మెంటేషన్ టెక్నిక్, శుభ్రత ప్రమాణాలు, నిల్వ విధానాలు వంటి అంశాలను ఈ వేబినార్‌లో స్పష్టంగా తెలియజేస్తారు. అదే విధంగా మార్కెటింగ్ బ్రాండింగ్ గురించి ముఖ్యమైన సూచనలు ఇవ్వబడతాయి. ఉత్పత్తిని తయారు చేయడం ఒక దశ మాత్రమే, దాన్ని సరైన వినియోగదారులకు ఎలా చేరవేయాలి? సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లు, లోకల్ మార్కెట్లు ఎలా ఉపయోగించుకోవాలి? వంటి విషయాలు వివరించబడతాయి. ఇది కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారికి చాలా ఉపయోగపడుతుంది. ఈ వేబినార్ ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై ఆధారపడి ఉంటుంది. కేవలం సిద్ధాంతం కాకుండా, వాస్తవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు వాటికి పరిష్కారాలు చర్చించబడతాయి. దీనివల్ల పాల్గొనే వారు ఆత్మవిశ్వాసంతో తమ వ్యాపారాన్ని ప్రారంభించగలుగుతారు. ఇంకా ఒక ముఖ్యమైన అంశం -- ఈ వేబినార్‌లో పాల్గొనడం ద్వారా నిపుణులతో నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుంది. మీ సందేహాలను అడిగి క్లారిటీ పొందవచ్చు. ఇది సాధారణంగా అందరికీ దొరకని అరుదైన అవకాశం నిర్వహిస్తున్న ఈ వేబినార్ ద్వారా ఫలాలతో వైన్ తయారీ వ్యాపారం పై పూర్తి అవగాహన పొందండి. మరిన్ని వివరాలు మరియు నమోదు కోసం వారి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయండి.

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

**జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు నిధులు కేటాయించిన రేవంత్ ప్రభుత్వం**

**రైతులను కాపాడాలని సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న తుమ్మల**

**పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**



తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ.4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

## రైతులకు రూ.2 లక్షల లోన్ ఇచ్చే స్కీమ్

కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మరిన్ని కీలక చర్యలు చేపట్టబోతోంది. రైతులకు రూ.2 లక్షల లోన్ ఇచ్చే స్కీమ్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పూర్తి వివరాలు తెలుసుకోండి. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు, అగ్రికల్చర్ లోన్ రైతుల జీవితంలో ఆర్థిక సౌలభ్యం మరింత సులభం కావడానికి, ప్రభుత్వం కొత్త మార్గాలను తీసుకొచ్చింది. ఈ కొత్త చర్యలతో రైతులు డిజిటల్ పద్ధతుల్లో సులభంగా రుణం పొందగలుగుతారు. చిన్న, అతి చిన్న రైతులు ప్రధానంగా ఈ ప్రయోజనాలను పొందుతారు. భారత ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు (కిసాన్ క్రెడిట్ కార్డ్) వ్యవస్థను బలోపేతం చేయడానికి కొత్త చర్యలను ప్రకటించింది. దీని ఉద్దేశం రైతులకు రుణాన్ని సులభంగా అందించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం. ఈ అంశాలను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ వివరించారు. ఇందులో విధాన మద్దతు, వడ్డీ తగ్గింపు, డిజిటల్ పద్ధతుల ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డుల జారీని విస్తరించనున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు, అగ్రికల్చర్ లోన్ కిసాన్ క్రెడిట్ కార్డ్ డిజిటల్ విస్తరణలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు డిజిటల్‌గా ఇవ్వబడతాయి. రైతులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ రుణాలను లింక్ చేసుకోవడానికి జన్ సమర్థ్ పోర్టల్ ప్రారంభించారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (==దీం), గ్రామీణ సహకార బ్యాంకులు (=జదీం) కోసం ఇ-కేసీసీ పోర్టల్స్ ద్వారా రైతులు బ్రాంచ్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. అనేక బ్యాంకులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, మొబైల్ యాప్స్‌ని రూపొందించి, రుణ ప్రక్రియను డిజిటల్‌లో పూర్తిగా అందిస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు, అగ్రికల్చర్ లోన్ విధానాలు, నియంత్రణ మద్దతులో, బ్యాంకులు వారి క్రెడిట్ లో కనీసం 18% వ్యవసాయ రంగానికి కేటాయించాలి. అందులో 10% చిన్న, అతి చిన్న రైతులకు ప్రత్యేకంగా కేటాయించాలి. ప్రాధాన్యతా రంగ రుణాలు (ఌూ) మార్గదర్శకాల ద్వారా వ్యవసాయ రుణం సమానంగా పంపిణీ అవ్వడానికి ప్రోత్సాహకాలు, షరతులు ఉన్నాయి. 2019 నుండి కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం పశుపాలన, పాల ఉత్పత్తి, చేపల వ్యవసాయం వంటి కార్యకలాపాలకు విస్తరించబడింది. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు, అగ్రికల్చర్ లోన్ ఆర్థిక సౌలభ్యాలను పెంచడానికి, మోడిఫైడ్ ఇంటరెస్ట్ సబ్వెన్షన్ స్కీమ్ క్రింద, రైతులు తక్కువ 7% వడ్డీతో తాత్కాలిక కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణం పొందగలుగుతారు. సమయానికి తిరిగి చెల్లిస్తే 4% వడ్డీ వర్తిస్తుంది. సహకార కార్యకలాపాలతో కూడిన తాత్కాలిక వ్యవసాయ రుణాల కోసం కోలాటరల్-ఫ్రీ రుణ పరిమితి రూ.1.6 లక్షల నుండి రూ.2 లక్షల వరకు పెరిగింది. 1 జనవరి 2025 నుండి అమలవుతోంది. కిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పుడు ూావీ డెబిట్ కార్డులు, ఒక్కసారిగా డాక్యుమెంటేషన్, వ్యయం పెరగడం పట్ల సౌకర్యం కలిగిస్తాయి. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, రైతులకు రుణాలు, వ్యవసాయ రుణాలు, అగ్రికల్చర్ లోన్ ఆర్థిక అవగాహన కోసం, ప్రభుత్వం, ఆర్‌బీఐ, నాబార్డ్ బ్యాంకుల ద్వారా కేంద్రం ఆర్థిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com